క్లుప్తంగా

ఇంటర్వ్యూల్లో 60 మంది ఎంపిక

రామచంద్రపురం: వీఎస్‌ఎం ఆటానమస్ కళాశాలలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 60 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎస్ఏఎస్ అన్సారీ శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ లిమిటెడ్ టెలికాలింగ్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 99 మంది హాజరు కాగా 60 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు తెలిపారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్‌మూర్తి, రవీంద్ర తదితరులు ఎంపికైన వారిని అభినందించారు.

శాశ్వత భూరక్ష పథకంతో రైతులకు మేలు



భూ యజమానులకు భూరక్ష పత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. యండగండిలో శనివారం భూ యజమానులకు జగనన్న భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ చోడే గోవిందరాజు(దత్తుడు) అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీటీసీ కడలి సత్యసూర్యకుమారి, తహసీల్దార్ వైద్యనాథశర్మ, కార్యదర్శి శీతారామయ్య చౌదిరి తదితరులు పాల్గొన్నారు.

125 మందికి కంటి వైద్య పరీక్షలు

రామచంద్రపురం: స్థానిక మోడరన్ విద్యా సంస్థల్లో అను కంటి ఆసుపత్రి సౌజన్యంతో మోడరన్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 125 మందికి కంటి పరీక్షలు చేసినట్టు విద్యా సంస్థల అధినేత జీవీ రావు తెలిపారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌లు జి.మాణిక్యం, ఎన్.సుధాకర్, ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో భీమేశ్వర దంత వైద్యశాల వైద్యుడు డాక్టర్ బచ్చు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ క్యాన్సర్ డేను పురస్కరించుకుని ఉచిత దంత వైద్య శిబిరం, క్యాన్సర్ నివారణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. క్యాన్సర్‌కు గల కారణాలపై అవగాహన కల్పించారు.

విద్యుత్ ఉద్యోగులకు సన్మానం



విద్యుత్ అధికారులను సత్కరించిన ఉద్యోగులు

ఆలమూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఉత్తమ అవార్డులు సాధించిన ముగ్గురు అధికారులకు శనివారం ఘన సత్కారం జరిగింది. ఆలమూరు సబ్‌స్టేషన్ వద్ద ఉత్తమ అవార్డులు పొందిన మండపేట ఏడీఈ జి.తిరుమలరావు, ఇన్‌చార్జి జేఈ వై.లక్ష్మి, లైన్‌మన్ అడబాల శ్రీరామకృష్ణలకు అభినందన సభ జరిగింది. విద్యుత్ ఉద్యోగులు అవార్డు గ్రహీతలకు పూలమాలలు, దుశ్శాలువ వేసి మెమొంటోలను బహూకరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనతికాలంలోనే విద్యుత్ సమస్యలు లేని సబ్‌స్టేషన్‌గా తీర్చిదిద్దిన ఇన్‌చార్జి జేఈ లక్ష్మిని పలువురు అభినందించారు.

లోకేష్ పాదయాత్రకు అడ్డంకులు

మండపేట: టీడీపీ నేత నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రకు ప్రభుత్వం కావాలనే అడ్డంకులు సృష్టిస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. పాదయాత్ర బంగారుపాళ్యం చేరుకోగానే పోలీసులు విద్యుత్ సరఫరా నిలిపివేశారని, బహిరంగ సభ జరగకుండా అడ్డుకున్నారన్నారు. ఎన్ని చేసినా పాదయాత్రను విజయవంతం చేస్తారని ఎమ్మెల్యే వేగుళ్ల శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



శనైశ్చరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన కొత్తపేట మండలం మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రానికి శనివారం ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. వివిధ రూపాల్లో టికెట్ల ద్వారా రూ.1,82,202 ఆదాయం, అన్నప్రసాదం విరాళం రూపంలో రూ.28,553 వచ్చినట్టు ఈఓ సింగం రాధ తెలిపారు.

ఆదుకుంటూ.. అండగా ఉంటూ..

- 'ఇంటికే పింఛను' పథకానికి మూడేళ్లు
- ఆర్థిక సమస్యలను అధిగమిస్తూ దిగ్విజయంగా అమలు చేసిన సర్కారు
- రెండు నియోజకవర్గాల్లో 74,402 మంది లబ్ధిదారులు

కపిలేశ్వరపురం: ప్రభుత్వమంటే ప్రజల ఆశ, శ్వాసగా ఉండాలి. సామాన్యుల ప్రయోజనాలే ప్రభుత్వ విధానాలుగా ఉండాలి. రాజకీయాలు ఎన్నికలు వరకే పరిమితంకావాలి. ఆ తర్వాత కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగాలి. ప్రజా ధనాన్ని ప్రజలు కోసమే ఖర్చు చేయాలి. అందుకోసం ఆర్థిక ఇబ్బందులను సైతం అధిగమించాలి. మేధావులు సూచించిన అంశాలిలా ఉన్నాయి. సరిగ్గా అలాగే సాగుతోంది రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు పెద్ద ఎత్తున సాయమందుతోంది. అమలులో ఉన్న సంక్షేమ పథకాల్లో అత్యంత ప్రముఖమైంది వైఎస్సార్ పింఛను కానుక పథకం. ఈ నెలలో రాష్ట్రంలో 63.87లక్షల మందికి రూ.1,759.99 కోట్లు పంపిణీ చేయాలన్నది లక్ష్యం కాగా శనివారం నాటికి 62,23,106 మందికి రూ.1,714.60 పంపిణీ చేసి 97.43 శాతం పంపిణీ లక్ష్యాన్ని నమోదు చేసింది. వలంటీర్ ఇంటికెళ్లి పింఛను డబ్బు అందజేలా ప్రారంభమై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పలు విషయాలను తెలుసుకుందాం

పథకం నేపథ్యం ఇదీ..

గత ప్రభుత్వాల కాలంలో పేదవాడికి పింఛను మంజూరు కావడం ఓ ప్రహసనంగా ఉండేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా అర్హతే ఆధారంగా పెద్ద సంఖ్యలో పింఛన్లు మంజూరు చేశారు. దానికితోడు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి 2020 ఫిబ్రవరి 1 నుంచి అవ్వాతాతల ఇంటికే తీసుకెళ్లి పింఛను డబ్బులు ఇవ్వడం ప్రారంభించారు.

వెటకారించిన వారే శభాష్ అన్నారు..

వలంటీర్లను నియమించే ప్రక్రియ ప్రారంభమైన రోజుల్లో విపక్షాలు వలంటీర్ వ్యవస్థను వెటకారం చేశారు. ఇదేం జరిగేపని కాదని, అంతా హంగామా అంటూ చమత్కరించారు. ఎవరెన్ని అన్నా పట్టించుకోకుండా సేవా దృక్పథంతో వలంటీర్లు నాటి నుంచి నేటి వరకూ పింఛన్లను పంపి చేస్తుండడాన్ని అందరూ శభాష్ అంటున్నారు.

సుదూర ప్రాంతాలకు వెళ్లి మరీ..

ఈ ఏడాది జనవరి 4న తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అర్తమూరుకు చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తునికి వలంటీర్ సీహెచ్ కల్యాణ్ అర్తమూరు నుంచి తిరుపతిలోని ఆసుపత్రికి వెళ్లి పింఛను సొమ్మును అందజేశారు. ఈ నెల 2న కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాజులూరు మండలం ఆర్యవటానికి చెందిన లబ్ధిదారునికి వలంటీర్ తాతపూడి నానాజి ఆర్యవటం నుంచి కాకినాడ వెళ్లి పింఛను సొమ్మును అందజేశారు. గత మూడేళ్లలో ఎంతో మంది వలంటీర్లు ఇలా సేవలందిస్తూ ప్రజల దీవెనలను పొందుతున్నారు.

రెండు నియోజకవర్గాల్లో పంపిణీ ఇలా...

ఈ ఏడాది జనవరిలో కొత్తగా 817 నూతన పింఛన్లను మంజూరు చేశారు. దాంతోపాటు పింఛను సొమ్మును రూ.2,500 నుంచి రూ.2,750కి పెంచారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాలు, ఒక పట్టణం పరిధిలో 1,839 పింఛన్లూ, మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాలు, ఒక పట్టణం పరిధిలో 1,261 పింఛన్లు మొత్తం 817 కొత్త పింఛన్లూ మంజూరయ్యాయి. ఫిబ్రవరి నెలలో రామచంద్రపురం నియోకవర్గంలో 35,764 మంది, మండపేట నియోజకవర్గంలో 38,638 మంది, మొత్తం 74,402 మంది పింఛన్లను పొందారు.



అంగరలో పింఛను అందజేస్తున్న వలంటీర్ శ్రీనివాస్

మండలాల వారీగా..

రామచంద్రపురం పట్టణంలో 4,538 మంది, రామచంద్రపురం రూరల్ మండలంలో 10,517 మంది, కె.గంగవరం మండలంలో 10,166 మంది, కాజులూరు మండలంలో 10,543 మంది, మండపేట పట్టణంలో 6,957 మంది, మండపేట రూరల్ మండలంలో 11,813 మంది, కపిలేశ్వరపురం మండలంలో 9,804 మంది, రాయవరం మండలంలో 10,064 మంది పింఛను సొమ్మును పొందుతున్నారు.

ఒకటో తేదీ తెల్లవారే సరికి..



ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి క్రమం తప్పకుండా పింఛను డబ్బులను ఇస్తున్నారు. ఒకటో తేదీ తెల్లవారే సరికి ఇంటి మంగుంటకు పింఛను వస్తోంది. నెల నెలా ఇస్తున్న రూ.3వేలు దివ్యాంగ పింఛను నాకు ఆసరగా నిలస్తోది. నాలాంటి దివ్యాంగులెందరికో వైఎస్సార్ పింఛను కానుక పథకం ఉపయోగపడుతుంది.

– కన్నా రాంబాబు, దివ్యాంగ పింఛను లబ్ధిదారుడు, కపిలేశ్వరపురం

కళ్లల్లో ఆనందం



ఒకటో తేదీ వచ్చిందంటే నాలాంటి వలంటీర్ల రాక కోసం పేదలు ఎదురు చూస్తున్నారు. వారికి డబ్బులు ఇచ్చినప్పుడు వారి కళ్లల్లో ఆనందాన్ని ప్రత్యక్షంగా చూశాను. ప్రతి నెలా ఓ మంచి పని చేస్తున్నానన్న భావన కలుగుతోంది.

– సుబ్రహ్మణ్యం, వలంటీర్, అంగర

నాణ్యమైన భోజనం అందించాలి

కాజులూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం(మిడ్డేమీల్స్)లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జగన్నాథగిరి ఎంపీటీసీ సభ్యురాలు కొప్పన లక్ష్మి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సలాది వీరబాబు ఆధ్వర్యంలో శనివారం ఎంపీటీసీ సభ్యురాలు కొప్పన లక్ష్మి తదితరులు జగన్నాథగిరిలోని జెడ్పీ పాఠశాలను సందర్శించి రూ.43 లక్షల వ్యయంతో జరుగుతున్న నాడు-నేడు నిర్మాణం పనులను, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పుణ్యమంతుల శివాజీ, కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాస్, నిమ్మన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎం శిక్షణ తరగతులకు ఎంపిక

కె.గంగవరం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న లీడర్ షిప్ ఫర్ ఎక్సిలెన్సు ఇన్ ఎడ్యుకేషన్ శిక్షణ తరగతులకు దంగేరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీవీవీ సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అహ్మదాబాద్‌లో ఇండియన్ ఇనిస్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగే శిక్షణలో సీవీవీ పాల్గొనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఈ శిక్షణ తరగతులకు ముగ్గురు హెచ్‌ఎంలు ఎంపిక కాగా వారిలో సీవీవీ ఒకరు. వీరు రాత పరీక్షతో పాటు పాఠశాల సమగ్ర అభివృద్ధి పథకం గురించి తెలిపే వీడియో ద్వారా ఎంపికయ్యారు.

సామాన్యుడి సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- అచ్యుతాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం



అచ్యుతాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: సామాన్య ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అచ్యుతాపురంలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ తోటను పూలమాలలతో సత్కరించి హారతిపట్టారు. కోలాహలంగా సాగిన పర్యటనలో గ్రామస్తులు తోట వెంట నడిచారు. ఎంపీటీసీ సభ్యుడు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పలివెల మధు, నాయకుడు చుండ్రు అమ్మన్న, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్సీ తోటకు వివరించారు. ఇంటింటికీ పర్యటిస్తూ ఆయా కుటుంబాలకు ప్రభుత్వం తరపున అందిన లబ్ధిని గుర్తు చేశారు. సాంకేతికంగా తలెత్తిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో మరే రాష్ట్రంలోనూ అమలు చేయనన్ని పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. ఆర్థిక సమస్యలనేకం రాష్ట్రాన్ని చుట్టుముడుతున్నా పేదల సంక్షేమాన్ని ఆపకుండా ముందుకు సాగుతున్నారన్నారు. గతంలో ప్రభుత్వాలు అడిగినా సాయం చేసేవి కాదని, నేటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మీకేమేమి కావాలంటూ పేదలను అడుగుతుందన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. మండల కేంద్రాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగనవసరం లేకుండా పేదల వద్దకే వలంటీర్, సచివాలయ వ్యవస్థలు తీసుకొచ్చిన ఘనత దేశం మొత్తంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగన్ పాలనను ఓర్వలేని విపక్షాలు ప్రజలను విడదీసే కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. వాటిపై అప్రమత్తంగా ఉంటూ సీఎం జగన్‌ను దీవించాలని ఎమ్మెల్సీ తోట కోరారు. ఎలాంటి సమస్యలెదురైనా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమం జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పలివెల మధు, పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల రామారావు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, నాయకులు రెడ్డి రుద్రమూర్తి, పూలపల్లి సూరిబాబు, నౌగ్రు చిన్నోడు, పాలచర్ల సూర్య ఉదయ భాస్కరరావు, బొజ్జా రామకృష్ణ సోమేశ్వరరావు, జగ్గారపు వీర్రాజు, శీలం గోవిందు, మాకన మాలయ్య, పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరందించాలని వినతి



ఏఎస్ఓకి వినతిపత్రం అందజేస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

కాజులూరు: శివారు భూములకు సాగునీరందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలు గ్రామాలలో కౌలురైతు సంఘం నాయకులు పర్యటించి నీటి ఎద్దడికి గురవుతున్న వరి పొలాలను పరిశీలించారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి ఏఎస్ఓకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి నేపథ్యంలో తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్న కాజులూరు మండల గ్రామాలకు తీవ్ర సాగునీటి ఎద్దడి ఎర్పడిందన్నారు. అధికారులు సాగునీటి సరఫరాలో కాలువ శివారు భూముల పొలాలకు ప్రాధాన్యతమివ్వడంతోపాటు పత్యామ్నాయ చర్యలపైనా దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల కౌలు రైతుసంఘం నాయకులు కొప్పుశెట్టి సర్వేశ్వరరావు, కె సూర్యనారాయణరెడ్డి, చొల్లంగి వెంకటరమణ, పెదింశెట్టి శ్రీను, రెడ్డి నేగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచేందుకే పొలంబడులు



ఆర్యావటంలో రైతులకు సూచనలు ఇస్తున్న మాధవి, బాబూరావు తదితరులు

కాజులూరు: వ్యవసాయంలో వ్యయం తగ్గించి, దిగుబడి పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న పొలంబడులను రైతు వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె.మాధవి అన్నారు. శనివారం ఆర్యావటంలో మండల వ్యవసాయాధికారి వి.అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడిలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మాధవి, కరప ఏడీఏ కె.బాబూరావు తదితరులు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. మండల గ్రామాలలో ప్రస్తుతం వరిపై జింకుదాతులోపం ఎక్కువగా కనిపిస్తుందని నివారణకు ఎకరం పొలంలో 100 గ్రాముల జింక్ సల్ఫేట్ వారం వ్యవదిలో రెండుసార్లు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ వారికి తగిన సలహాలు అందించాలన్నారు.



రైతులకు పొలంబడి సూచనలిస్తున్న ఏడీ జయరామలక్ష్మి తదితరులు

పాణింగపల్లిలో 'పొలంబడి'

కె.గంగవరం: పాణింగపల్లిలో రామచంద్రపురం వ్యవసాయ సహాయకులు జయరామలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం 'పొలంబడి' నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం పాటించడం వల్ల ఖర్చును అదుపులో ఉంచుకోవచ్చని, రబీలో పొలాలకు వాడాల్సిన ఎరువులపై అవగాహన కల్పించారు. పొలాలకు జింకులోపం ఉంటే నాట్లు వేసిన రెండు నుంచి ఐదు వారాల మధ్య జింక్ సల్ఫేట్‌ను 2 గ్రాములకు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయా లని రైతులకు వివరించారు. ఏఓ బి.రవి మాట్లాడుతూ భూమిలో గడ్డి, పెంట వంటి వ్యర్థ పదార్థాలను కుళ్లించడం ద్వారా సుక్ష్మజీవులు ఉద్భవించి మొక్కకు మేలు చేస్తామన్నారు. వ్యవసాయ సహాయకుడు బండారు శ్రీరామ్, గ్రామ పెద్దలు చీకట్ల గోపాలం, కొండ, సొసైటీ అధ్యక్షుడు వైట్ల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ పోషకాలు

- ఆత్మ పీడీ జ్యోతిర్మయి
- ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



చెల్లూరులో ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తున్న ఆత్మ పీడీ జ్యోతిర్మయి తదితరులు

రాయవరం: ప్రతి ఒక్కరూ ఆహారంలో చిరుధాన్యాలను ఉపయోగించడం వల్ల సంపూర్ణ పోషకాలు అందుతాయని ఆత్మ పీడీ జ్యోతిర్మయి సూచించారు. మండలంలోని చెల్లూరులో మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం ఆత్మ ప్రోగ్రామ్ ద్వారా మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయం, మెరుగైన సేద్యం పద్ధతులపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. చిరుధాన్యాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఆహారంలో చిరుధాన్యాల ఉపయోగించడం వల్ల అన్ని పోషక పదార్థాలు పిల్లలకు అందడం ద్వారా ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడతాయన్నారు. రైతులకు చిరుధాన్యాల ఉపయోగం, ఉత్పత్తిపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో పీడీ జ్యోతిర్మయి మాట్లాడుతూ పెరటి తోటలకు ఎటువంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా కూరగాయలు పండించాలన్నారు. దీని వల్ల మన ఆరోగ్యం మనం కాపాడుకోవడమే కాకుండా, వాతావరణ కాలుష్యం జరగకుండా ఉంటుందన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజరు జె.ఎలియాజర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రతి రైతు వారికి ఉన్న పొలంలో కొద్ది మొత్తం ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చును తగ్గించుకుని, అధిక నికర ఆదాయం సాధించే దిశగా రైతులు ఆలోచించాలన్నారు. కొబ్బరి పొట్టుతో ఎరువులను ఏ విధంగా తయారు చేయాలి, ఉపయోగాలను తయారు చేసి చూపించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చిక్కాల శ్రీరాములు మట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు. అనంతరం మహిళా రైతులకు కూరగాయల విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీరవేణి, వైఎస్సార్ సీపీ నేత పాలిక గోవిందు, డీపీఎం ఎంవీవీ సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ మేనేజరు అధికారి శ్రీనివాస్, డీఆర్సీ వ్యవసాయ అధికారి మనోహర్, ప్రకృతి వ్యవసాయం డిస్ట్రిక్ట్ మేనేజరు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సమైక్య భారతీ న్యాయ సలహాదారుడిగా గోవిందరావు



టీవీ గోవిందరావు

మండపేట: సమైఖ్య భారతీ (మాతృభాషా సాంస్కృతిక సామాజిక చైతన్య సంస్థ) న్యాయ సలహాదారునిగా మండపేటకు చెందిన న్యాయవాది టీవీ గోవిందరావును నియమితుల య్యారు. ఈ మేరకు సంస్థ కోఆర్డినేటర్ పి.కన్నయ్య నియామక ఉత్తర్వులిచ్చినట్టు శనివారం గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు అడ్వకేట్‌గా, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ న్యాయ సలహాదారుగా, గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) లీగల్ అడ్వైజర్‌గా, సౌత్ సెంట్రల్ రైల్వే టెక్నికల్ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్‌గాను గత రెండు దశాబ్దాలుగా ఆయన సేవలు అందిస్తున్నారు. మాతృభాష ఔన్నత్యాన్ని కాపాడేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారినందరిని ఒక తాటిపైకి తీసుకువచ్చేందుకు సమైఖ్య భారతి కృషి చేస్తోందని గోవిందరావు తెలిపారు. గోవిందరావు నియామకంపై పలువురు పట్టణ ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు.

బీచ్ వద్ద ఏర్పాట్ల పరిశీలన



అంతర్వేది బీచ్ వద్ద ఏర్పాట్లపై మాట్లాడుతున్న డీఎస్పీ రమణ

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థమహోత్సవాల్లో తొమ్మిదో రోజు ఆదివారం మాఘపౌర్ణమి సందర్భంగా బీచ్ వద్ద సముద్రంలో స్వామిని స్నానం చేయించే సమయంలో తీసుకోవాల్సిన భద్రతాపరమైన ఏర్పాట్లను, భక్తులకు సంబంధించి ఇతర ఏర్పాట్లను వేర్వేరుగా రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు శనివారం పరిశీలించారు. అమలాపురం ఆర్డీవో వసంతరాయుడు, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణతో కలసి పరిశీలించారు. ఒడ్డున స్వామికి నిర్వహించే విశేషపూజలు, స్వామిని సముద్రంలో తీసుకువెళ్లే క్రమంలో తగిన భద్రత గురించి ఆర్డీవో సమీక్షించారు. అలాగే సముద్రంలో స్నానం చేసే సమయంలో తొక్కిసలాట లేకుండా తీసుకోవాల్సిన చర్యలను డీఎస్పీ రమణ, ఎస్సై అడపా ఫణి మోహన్‌కు సూచించారు. వీటితో పాటు భక్తులు లోతు జలాల్లోకి వెళ్లకుండా సముద్రంలో ఏర్పాటు చేసిన సర్వేబాదుల బారికేట్స్, స్వామిని తీసుకువెళ్లే మార్గాన్ని డీఎస్పీ పరిశీలించారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామిఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

ధర్మకర్తల మండలికి ఏర్పాటుకు నోటిఫికేషన్

కొత్తపేట: మండలంలోని పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి ఏర్పాటు నిమిత్తం దేవదాయ-ధర్మదాయ శాఖ కాకినాడ ఉప కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు దేవస్థానం ఈఓ ఎస్‌వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 3 నుంచి 20 రోజుల్లోగా ఎండోమెంట్ యాక్ట్ 30/87 ప్రకారం తగు అర్హత గలవారు ధర్మకర్తలుగా ఉండు నిమిత్తం దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరారు.

స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవానికి ఏర్పాట్లు

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థమహోత్సవాల్లో పదోరోజు సోమవారం అంతర్వేది చెరువులో దేవస్థానం ఆధ్వర్యాన నిర్వహించే స్వామి, అమ్మవార్ల తెప్పోత్సానికి ఏర్పాట్లు శనివారం ప్రారంభించారు. ఇందుకు అవసరమయ్యే రెండు ఫైబర్ వేట బోట్లను పల్లిపాలెం హార్బర్ వద్ద నుంచి ఓఎన్జీసీ భారీ ట్రాలీపై తీసుకువచ్చి చెరువులోకి చేర్చారు. అంతకుముందు హార్బర్ వద్ద బోట్లను క్రేన్ సాయంతో ట్రాలీపైకి చేర్చారు. చెరువులో బోట్లను కలుపుతూ చెక్కలతో అరప సిద్ధం చేసే పనులు చేట్టారు. అనంతరం హంస వాహనాన్ని రెండు బోట్లు కలిపిన అరపై ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణ చేసి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. స్వామిని పుష్పకవాహనంపై గ్రామోత్సవం అనంతరం తెప్పపై అర్చకులు కొలువుదీరుస్తారు.

క్షతగాత్రుడికి రూ.30 వేల ఆర్థిక సాయం

ఆలమూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద కోలుకుంటున్న క్షతగాత్రుడు గంధం వెంకన్నకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రూ.30 వేలు ఆర్థికసాయం అందించారు. మండలంలోని పెనికేరులోని అతని నివాసానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా అండగా ఉంటానని, ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు సమకూర్చిన రూ.పది వేలను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. సర్పంచ్ వనుం చిన్నావతి, ఎంపీటీసీ యనమదల స్వాతి, పీఏసీఎస్ అధ్యక్షులు జుత్తుక శ్రీనివాసు పాల్గొన్నారు.